ప్రజాశక్తి
గురువారం 22 డిసెంబర్ 2022 5 విజయనగరం



23 నుంచి మంత్రి బొత్స జిల్లా పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం రాత్రి జిల్లాకు చేరుకుంటారు. 23న ఉదయం 10.30 గంటలకు పార్వతీపురం చేరుకొని లయన్స్ క్లబ్‌లో జిల్లా పార్టీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1-30 గంటలకు సీతానగరంలో బయలుదేరి శ్రీకాకుళం వెళతారు. అక్కడ జిల్లా పార్టీ సమావేశంలో పాల్గొని సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు. 24న ఉదయం 10.30 గంటలకు బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4 గంటలకు మెరకముడిదాం మండలం ఇప్పలవలసలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలు ప్రారంభిస్తారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తారు.



తెలుగు తమ్ముళ్లలో నూతనోత్తేజం

- నేటి నుంచి మూడు రోజులపాటు చంద్రబాబు పర్యటన
- రాజాం, బొబ్బిలి, విజయనగరాల్లో బహిరంగ సభలు
- ఏర్పాట్లలో తలమునకలైన నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు చాలా కాలం తరువాత జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లలో నూతనోత్తేజం కనిపిస్తోంది. సుమారు మూడున్నరేళ్లగా జిల్లా నాయకత్వం పెద్దగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించకపోవడం, అధినేత వచ్చిన దాఖలాలు కనిపించకపోవడం, అధికార పక్షం దూకుడు వైఖరి మధ్య తెలుగు తమ్ముళ్లు డీలాపడ్డారు. ఇటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు వరుసగా మూడు రోజులపాటు పర్యటిస్తుండడంతో పార్టీ కేడర్‌లో ఆసక్తి, ఉత్తేజం కనిపిస్తోంది. రాజాం, బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గ కేంద్రాల్లో జరగబోయే బాబు బహిరంగ సభలకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కేంద్రాలు పార్టీ జెండాలు, తోరణాలతో పుసుపుమయంగా మారు తున్నాయి. ఇప్పటికే నాయకులు స్వాగత ఏర్పాట్లలో తలమునకలయ్యారు. పర్యటన విజయవంతమయ్యేలా చూడాలంటూ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలను రాష్ట్ర కేంద్రం జిల్లాకు పంపించి. వీరిద్దరూ బుధవారం విజయనగరం చేరుకుని స్థానిక నేతలు అశోక్ గజపతిరాజు, కిమిడి నాగార్జున తదితరులతో కలిసి చర్చించారు. మూడు చోట్ల జరిగే బహిరంగ సభలకు భారీగా జనాన్ని సమీకరించాలని ఆదేశించారు. ఆయా నియోకవర్గ నాయకులు కూడా గత కొన్ని రోజులుగా ఇదే పనిలో ఉన్నారు. చంద్రబాబు మూడు రోజుల పర్యటనలో మూడు నియోజవర్గాల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మాట్లాడుతారు. దీనికి సంబంధించిన వివరాలను ఆ పార్టీ నాయకులు బుధవారం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్పష్టం చేశారు. గురువారం ఉదయం విశాఖ నుంచి జిల్లాలో ప్రవేశిస్తారు. డెంకాడ మండలం నాతవలస టోల్‌గేట్ వద్ద జిల్లా నాయకత్వం స్వాగతం పలకనుంది. స్వాగత కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనేందుకు డెంకాడ మండల నాయకులు భారీ ఏర్పాటు చేస్తున్నారు. రాజాం మండలం పొగిరి నుంచి చిలకపాలెం, రాపాక జంక్షన్, పొందూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. సాయంత్రం 5గంటలకు అంతకాపల్లి మీదుగా రాజాంలోని హెచ్‌పి పెట్రోల్ బంకుకు చేరుకున్నాక రోడ్‌షో ప్రారంభమవు తుంది. 6గంటలకు సూపర్ మార్కెట్ వద్ద సభలో చంద్రబాబు మాట్లాడుతారు. అనంతరం రాత్రి అక్కడే బసచేస్తారు. శుక్రవారం ఉదయం ఎస్‌సి, ఎస్‌టి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడతారు. 23న మధ్యాహ్నం 2గంటలకు బొబ్బిలివలస, కంచరం మీదుగా పెరుమాళి చేరుకుంటారు. అక్కడి నుంచి తెర్లాం, గంగన్నపాడు, నందిగాం, రాజేరు, పినపెంకి, కారాడ మీదుగా ద్విచక్ర వాహన ర్యాలీ సాగుతుంది. సాయంత్రం 5.30గంటలకు చర్చి సెంటర్ నుంచి ఓంకార్ థియేటర్, చాకలివీధి వరకు రోడ్‌షో ఉంటుంది. సాయంత్రం 6.20గంటలకు బహిరంగ సభలో పాల్గొంటారు. రాత్రికి రాజావారి ప్యాలెస్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 24న ఉదయం 11గంటల నుంచి 12.30గంటల వరకు దర్బార్ మహల్‌లో రైతులతో మాట్లాడతారు. అనంతరం మెట్టవలస, సీతారాంపురం, పిరిడి, రామభద్రపురం, గజపతినగరం, బొండపల్లి, గొట్లాం మీదుగా ద్వారపూడి జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి వెంకటలక్ష్మి జంక్షన్ మీదుగా కోట జంక్షన్ వరకు రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతారు. పర్యటన మొత్తంలో ఎక్కడా వేదికలు ఏర్పాటు చేయబోరని, అన్ని చోట్ల ఓపెన్‌టాప్ వాహనం నుంచి మాట్లాడుతారని పార్టీ నాయకులు చెబుతున్నారు.

టిడిపిలో 80 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి -విజయనగరం కోట

మండలంలోని పినవేమలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకరి సన్యాసప్పుడు(చిన్న) కనకల రాంబాబు ఆధ్వర్యంలో 80 కుటుంబాలు, రాకోడు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు పోతిపిరెడ్డి అప్పారావు ఆయన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు , చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యాన టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా ఉందని అన్నారు.

బంగారు భవిష్యత్తే లక్ష్యం

ఉచిత ట్యాబ్‌లో పంపిణీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల • ఆంధ్రప్రదేశ్‌లోనే ఇలాంటి అవకాశాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థుల బంగారు భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా విద్యా రంగంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, దానిలో భాగంగానే ఉచిత ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ పలు సంస్కరణలు చేసిందని గుర్తు చేశారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన స్థానిక ధర్మపురి జిల్లా పరిషత్ వేదికగా జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారితో కలిసి బుధవారం ప్రారంభించారు. ముందుగా పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులు సౌజన్య, హరినాథ్, ఆంగ్లంలో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అమ్మ ఒడి, నాడు - నేడు, వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న విద్యాకానుక తదితర పథకాలు విద్యారంగంలో ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడ్డాయని, ప్రభుత్వ బడుల్లో చేరేవారి సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. అనంతరం విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి 260 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు.

ఏపీలోనే ఇలాంటి వసతులు, సౌకర్యాలు

కలెక్టర్ ఎ. సూర్యకుమారి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌లోనే ఇలాంటి అవకాశాలు, వసతులు అందుబాటులో ఉన్నాయని వీటిని సద్వినియోగం విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.



విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రయివేటుకు ధీటుగా ఈ రోజు వసతులు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. జిల్లా వ్యాప్తంగా 457 పాఠశాలలను ఎంపిక చేసి ట్యాబ్‌లు అందజేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 18 వేల మంది విద్యార్థులు, 2457 మంది ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరనుందని వివరించారు. బైజ్యూస్ కంటెంట్ తో కలిపి ఒక్కో ట్యాబ్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 వేలు కేటాయించిందని తెలిపారు. వీటి నిమిత్తం జిల్లాకు రూ.58 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డిఇఒ లింగేశ్వరరెడ్డి, ఎపిసి స్వామినాయుడు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి, పోస్టుల సంఖ్య పెంచాలి

డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు అభ్యర్థుల వయో పరిమితితో పాటు పోస్టుల సంఖ్యను పెంచాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రజా సంఘాల ఆఫీసులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సై కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో వయోపరిమితి ఐదు సంవత్సరాలు పెంచాలని ,పరీక్ష గడువు కాలాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఫైర్, జైలు వార్డెన్ పోస్టుల ప్రస్తావన లేకపోవడంతో నాలుగేళ్లగా ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు నిరాశలయ్యాయని అన్నారు. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేని పక్షాన జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎస్.రుద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి బి.సతీష్, జిల్లా కమిటీ సభ్యులు రామ్మోహన్ ,వెంకటేష్ , నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు రాము



కొవ్వొత్తులు వెలిగించి వేడుకల్లో పాల్గొన్న జెడ్‌పి చైర్మన్, కలెక్టర్, డిఆర్ఒ

ఘనంగా క్రిస్మస్ హైటీ

ప్రజాశక్తి-విజయనగరం

క్రీస్తు బోధనల సారాన్ని అర్థం చేసుకొని, ప్రతీ ఒక్కరూ సంఘానికి ఉపయోగ పడాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కంటోన్మెంట్ సిఎస్ఐ చర్చ్ లో క్రిస్మస్ హైటీ కార్యక్రమం బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఛైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పరోపకారమే క్రీస్తు బోధనల సారమని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగ పడినప్పుడే, బోధనలకు సార్థకత లభిస్తుందన్నారు. క్రైస్తవుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేడుకల్లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిఆర్ఒ ఎం.గణపతిరావు, జిల్లా పర్యాటక శాఖాధికారి పి.ఎన్.వి. లక్ష్మీనారాయణ, మైనారిటీ సంక్షేమ శాఖాదికారి టి.చంద్ర శేఖరరావు, క్రైస్తవ పెద్దలు ఆర్ఎస్‌జాన్, జాన్ మోజెస్, బిషప్ ఫిలోమెన్, ప్రీస్లి, అషా జాన్, ఆనంద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు

ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని విజయనగరం నియోజకవర్గంలో వైసిపి ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. జొన్నవలసలో జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత కార్యకర్తలు, అభిమానులు మధ్య డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కేక్ కట్ చేశారు. ఎఎంసి చైర్మన్ జమ్ము శ్రీను, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, సర్పంచ్ కంది రమాదేవి, ఉప సర్పంచ్ లెంక అప్పారావు, నాయకులు కంది గణపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ అధికారం చేపట్టిన మూడున్నర సంవత్సరాల లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని అన్నారు. జనవరి ఒకటి నుంచి 2,750 పింఛను అందించబోతున్నారని అన్నారు.

కంటోన్మెంట్ జోన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ఆసుపత్రిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఇచ్చాపురం మాజీ ఎమ్మెల్యే నరేష్ కుమార్ అగర్వాల్ తో కలసి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రిన్సిపల్ , ఆసుపత్రి సూపరింటెండెంట్, కార్పొరేటర్లు కడియాల రామకష్ణ, పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, తోగరోతు సంధ్యారాణి, దాసరి సత్యవతి, బొద్దురు గోవిందమ్మ, తాళ్లపూడి సంతోషి తదితరులు పాల్గొన్నారు. పేర్ల వారి వీధిలో ఉన్న పేర్ల మహాజన్ చెవిటి మూగ పాఠశాల విద్యార్థుల మధ్య భారీ కేకును కట్ చేసి, విద్యార్థులకు తినిపించారు. విద్యార్థులకు అవసరమైన స్టీలు కంచాలు, గ్లాసులు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు.

మెగా రక్తదాన శిబిరం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యాన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ రక్తదాతగా మారి ప్రాణదాతగా నిలవాలని కోలగట్ల అన్నారు. అనంతరం హిజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 50 కేజీల కేకును కోలగట్ల, విజయనగరం నియోజకవర్గ పరిశీలకులు నరేష్ కుమార్ అగర్వాల్ కట్ చేశారు. ఈ సందర్భంగా సిఎం పుట్టిన రోజు సందర్భంగా పేదలకు దుప్పట్లు చీరలు, రోగులకు పండ్లు, పాలు, వికలాంగులకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేశామన్నారు. నరేష్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో 420 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో మేయర్ శ్రీమతి వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవి, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంఘం రెడ్డి బంగారు నాయుడు, నగరపాలక అధ్యక్షులు ఆశపు వేణు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పిటిసి తదితరులు

అంధుల పాఠశాలకు నిత్యావసర సరుకులు

ముఖ్యమంత్రి పుట్టిన రోజును పురస్కరించుకొని బుధవారం ద్వారకామయి అంధుల పాఠశాలకు వైసిపి నాయకులు పిల్లా విజయకుమార్, అవనాపు విజయ్ నిత్యావసర సరుకులను అందజేశారు. విద్యార్థులకు పండ్లు,బిస్కెట్ ప్యాకెట్లతోపాటు 100 కిలోల బియ్యం, రెండు డబ్బాల ఆయిల్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

23న తైక్వాండో, షూటింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23తేదీన స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో తైక్వాండో పోటీలకు, గొట్లాం జెడ్‌పి హైస్కూలు మైదానంలో షూటింగ్ పోటీలకు అండర్ 19 విభాగంలో ఎంపిక జరుగుతుందని స్కూలు గేమ్స్ కార్యదర్శి కృష్ణ, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. క్రీడాకారులు 2004 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. వారి పుట్టిన రోజు సర్టిఫికెట్లు పట్టుకొని హాజరు కావాలని కోరారు.

ఘోషాస్పత్రికి పరికరాలు బహూకరణ

ప్రజాశక్తి-విజయనగరం

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వైసిపి ఆధ్వర్యాన ఘోషా ఆసుపత్రికి రూ.లక్ష విలువైన పరికరాలను విరాళంగా అందజేశారు. రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి, నియోజక వర్గ పరిశీలకులు నరేష్ కుమార్ అగర్వాల్ (లల్లు), మేయర్ విజయలక్ష్మి ఈ పరికరాలను బుధవారం ఘోష ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఇందులో నాలుగు స్ట్రెచర్‌లు, బి.పి. యంత్రం, స్టెతస్కోప్‌లు వున్నాయి. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వున్న బాలింతలు, గర్భిణులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రిన్సిపాల్ తో పాటు , ఘోషాసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా కేంద్ర ఆసుపత్రి సలహా మండలి సభ్యులు ఆడారి నగేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సైకో పాలన

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో దొంగ సైకో పరిపాలన సాగుతోందని మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజుతో కలిసి అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. ఈనెల 22న రాజాం, 23న బొబ్బిలి, 24న విజయనగరంలో చంద్రబాబు పర్యటన ఉంటుందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలు టిడిపికి కంచు కోట అని, రాష్ట్రంలో వైసిపి పాలనపై ప్రజల్లో విరక్తి వచ్చిందని అన్నారు. అవగాహన లేని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పరిపాలన చేయడం దురదృష్టకరమని, సలహాదారులు, సలహాలు అన్నీ రాష్ట్రాన్ని దోచుకోవడానికేనని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. మద్యం విషయంలో భారీ అవినీతి జరుగుతోందన్నారు. పేదల గృహాలు విషయంలో కూడా భారీ స్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. వైసిపి నాయకులు పేదల బియ్యాన్ని కూడా బ్లాక్‌మార్కెట్ చేస్తున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు వెన్నకి వెళ్లిపోతున్నాయని, ఇస్తానన్న 6లక్షల ఉద్యోగాలు ఎక్కడని జగన్‌ను ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు తప్ప రాష్ట్రంలో ఇంకెవరూ బాగుపడలేదన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టి అరెస్టులు చేయించాలని చూస్తున్నారని, కేసులకు భయపడే పరిస్థితి లేదన్నారు. ఉత్తరాంధ్రలో రూ.45 వేల ఎకోట్లు ప్రయివేట్ ఆస్తులను విజయసాయిరెడ్డి ఆక్రమించారని ఆరోపించారు. ఉత్తరాంధ్రలో బొత్స సత్తిబాబుకు పవర్ లేదని, ఉత్తరాంధ్ర వైసిపి నాయకులు డమ్మీ అయిపోయారని అన్నారు. రాష్ట్రంలో 25లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారని, ఇప్పటివరకు పార్లమెంట్ లెక్కల ప్రకారం రాష్ట్రంలో కేవలం ఐదు ఇళ్లు మాత్రమే పూర్తి చేయగలిగారని తెలిపారు. ఈ ఇళ్లు కూడా చెరువులు, శ్మశానాలు పక్కన ఇవ్వడం వల్ల పేదలు ఆసక్తి చూపడం లేదన్నారు. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రజలు బాగుపడటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం ఉండదు కంపెనీలు పెట్టి ఉద్యోగాలు యువతకు అందించలేకపోయారన్నారు.ఈ నేపథ్యంలో జిల్లాకు రానున్న చంద్రబాబుకు నాతవలస టోల్‌గేట్ వద్ద టిడిపి శ్రేణులంతా భారీ ఘన స్వాగతం పలుకుతారని తెలిపారు. ఈనెల 24వ తేదీన విజయనగరం కోటవద్ద భారీ బహిరంగ సభ రోడ్ షో ఉంటాయని చెప్పారు కార్యక్రమంలో ఉత్తరాంధ్ర టిడిపి కోఆర్డినేటర్ బుద్దా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, బొద్దుల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు, అశోక్‌గజపతిరాజు

టిడిపిలో గ్రూపుల పోరు

రాజాంలో ప్రతిభా భారతి X కోండ్రు మురళి

విజయనగరం, గజపతినగరాల్లో అశోక్ X గీత, కెఎనాయుడు

బాబు పర్యటనలో చక్కదిద్దేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపిలో గ్రూపుల పోరు తారా స్థాయికి చేరింది. ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ బహిర్గతమౌతునే ఉన్నాయి. జిల్లా పార్టీకి అన్నీ తానై వ్యవహరిస్తున్న అశోక్ వైఖరి పలు నియోజకవర్గాల నాయకులకు మింగుడు పడడం లేదు. మరికొన్ని చోట్ల నాయకుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. సాక్షాత్తు బాబు పర్యటన ఏర్పాట్లలోనే ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో నాయకుల మధ్య విభేదాలకు, గ్రూపుల పోరుకు బాబు చెక్ పెడతారా? లేక అధికారపక్షమే లక్ష్యంగా పర్యటన సాగుతుందా? అన్నదానిపై రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా చర్చిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ఒకప్పుడు టిడిపికి కంచుకోట. మొత్తం 12 నియోజకవర్గాలు కైవసం చేసుకుని, అప్పటి కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించిన చరిత్ర ఉంది. కాల క్రమీణ జిల్లా నాయకత్వంలో ఒంటెద్దు పోకడలు, ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడం, ప్రజలతో సంబంధాలు తగ్గడం, లౌకికవాదంపై మారిన వైఖరి వంటి కారణాలవల్ల పార్టీ జవసత్వాలు సన్నగిల్లిపోయాయి. చివరకు గడిచిన ఎన్నికల్లో టిడిపి చరిత్రను, రికార్డును వైసిపి బద్ధలగొట్టి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ చొచ్చుకుపోయింది. రాష్ట్ర పార్టీ పిలుపులు తప్పితే, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో టిడిపి నాయకులు ప్రజా సమస్యలపై స్పందించిన దాఖలాలు లేదు. మరోవైపు జిల్లాలో నాయకుల మధ్య అనైక్యత, గ్రూపుల పోరు తారా స్థాయికి చేరింది. ముఖ్యంగా విజయనగరంలో మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుల మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయి. పార్టీ నాయకుల స్వతంత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని, బిసిలను ఎదగనీయడం లేదని చాలా కాలంగా గీత చేస్తున్న అభియోగం. పలు మార్లు గీత తన అనుయాయులతో చంద్రబాబును కలిశారు. ఇప్పటికీ అదే ఒరవడి కొనసాగుతోంది. ఇటు గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు, అశోక్ మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. ఇప్పటి వరకు విమర్శల రూపంలో బహిర్గతం కాకపోయినప్పటికీ అశోక్ బిసిలపట్ల వివక్షగా, చిన్నచూపుగా వ్యవహరిస్తున్నారని కెఎ నాయుడు తన సన్నిహితుల వద్ద చెబుతున్నారు. ఇంతకన్నా ముఖ్యంగా కెఎ నాయుడ్ని టార్గెట్ చేస్తూ గజపతినగరం మరో నాయకుడు కరణం శివరామకృష్ణను ప్రోత్సహిస్తున్నారని విమర్శలు కూడా అశోక్‌పై ఉన్నాయి. బిసిల మధ్య చిచ్చుపెట్టి, ప్రభుత్వం ఏర్పాటైన సందర్భాల్లో కేబినెట్‌లో తన బెర్తు పదిలం చేసుకునేందుకు పార్టీలో సినియర్లను ఎదగనివ్వకుండా చేస్తున్నారన్ని చర్చ కూడా నడుస్తోంది. అటు రాజాంలో మాజీ స్పీకర్, టిడిపి సీనియర్ నేత కావలి ప్రతిభా భారతి, టిడిపి నియోకవర్గ ఇన్‌ఛార్జి కోండ్రు మురళి మధ్య విభేదాలు బాహాటంగానే కనిపిస్తున్నాయి. ఎవరికి వారే గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని విశ్లేషకులు అంచనా. అందుకు తగ్గట్టే బాబు పర్యటనకు పలు పంచాయతీల్లో గ్రూపులవారీగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. భవిష్యత్తులో రాజాం నియోజకవర్గం అసెంబ్లీ సీటు ఎవరికి ఇస్తారో? అన్నదానిపై ఆసక్తికరమైన చర్చ సాగుతుండగా, తమకే వస్తుందంటూ ఇద్దరూ ప్రచారం చేసుకుంటున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో కాకలు తీరిన నేత పతివాడ నారాయణ స్వామినాయుడు వయసు మీరడంతో ఎవరికి వారే నాయకులు అన్నట్టుగా వ్యహరిస్తున్నారు. డెంకాడలో కంది చంద్రశేఖర్, భోగాపురంలో కర్రోతు బంగార్రాజు, నెల్లిమర్లలో కడగల ఆనంద్ నాయకులుగా చలా మణి అవుతున్నప్పటికీ, అంతా ఒక్కతాటిపైకి రావడం లేదు. ఇటు బొబ్బిలి నియోజకవర్గంలో గ్రూపుల బెడద పెద్దగా లేకపోయినప్పటికీ మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, నియోజకవర్గంలో అన్నీ తానై వ్యవహరిస్తున్న బేబీ నాయనల ఆధిపత్య ధోరణులు కనిపిస్తున్నాయి. వీటన్నింటిపైనా బాబు ఇప్పట్లో దృష్టిసారిస్తారా? లేక వీటిని పక్కనబెట్టి కేవలం ప్రతిపక్షమే లక్ష్యంగా ప్రసంగాలకే పరిమితమౌతార అన్నదానిపై చర్చనడుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న విసి జిఎస్ఎన్ రాజు

'నాక్' గుర్తింపునకు సెంచూరియన్

వైస్ ఛాన్సలర్ జి.ఎస్.ఎన్ రాజు

నెల్లిమర్ల : సెంచూరియన్ విశ్వవిద్యాలయం 'నాక్' గుర్తింపునకు సన్నద్ధమవుతుందని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్ రాజు అన్నారు. బుధవారం సాయంత్రం యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాక్ గుర్తింపునకు అవసరమైన సదుపాయాలు విశ్వవిద్యాలయంలో ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలకు గవర్నర్ బిశ్వభూషన్ జూమ్ సమావేశం ద్వారా పాల్గొని వేడుకలను విజయవంతం చేయడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన సిబ్బందికి, పాత్రికేయులకు అభినందనలు తెలిపారు. నూతన విద్యా విధానంలో నైపుణ్య శిక్షణ తప్పనిసరి అన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, ప్రొఫెసర్ కృష్ణమూర్తి, డీన్ పుష్పలత, డీన్ సన్నీ డియోల్, డాక్టర్ మధు స్మిత చౌదరీ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యంపై విద్యార్థులకు శిక్షణ

వేపాడ : స్థానిక పశు వైద్య కేంద్రంలో ఎస్కోట వరలక్ష్మి కళాశాలకు చెందిన విద్యార్థులకు బుధవారం పశువైద్యాధికారి సింహాద్రి నాయుడు పశువైద్యం, దానాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ పట్నాయక్

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

వేపాడ : మండల కేంద్రంలో గల వల్లంపూడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపిడిఒ పట్నాయక్ బుధవారం పరిశీలిం చారు. రైతుల వద్ద కొనుగోలు చేస్తున్న ధాన్యం తూకం వివరాలను, అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆర్బికెలో పనిచేస్తున్న విఎఎనుకు వారు చేయాల్సిన విధులు గురించి వివరించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట జెడ్పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఇఒపిఆర్డి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు పనులు ప్రారంభం

మెంటాడ : మండలంలోని పిట్టాడ పంచాయతీలో నాలుగు బోరు బావుల పనులను పూజలు చేసి బుధవారం సర్పంచ్ కాపారపు పైడిపునాయుడు ప్రారంభించారు. ఇదే పంచాయతీ మధుర గ్రామాలు వాణిజలో ఒకబోరు బావి, చీపురవలసలో ఒక బోరుబావి పనులను ప్రారంబించారు. ఆయా గ్రామాలలో తాగునీటి పైపులైన్లు మరమ్మత్తులు నేపథ్యంలో పంచాయతీ నిధులతో ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేయడం జరుగుతుందని సర్పంచ్ పైడిపునాయుడు తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

బొబ్బిలి : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వైసిపి కార్యాలయంలో లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పంపిణీ చేశారు. మూడేళ్లలో నియోజకవర్గంలో 71మందికి 6రూ.69.43లక్షలు పంపిణీ చేశామని చెప్పారు. ఒక బాలుడు గుండె మార్పిడికు రూ.10లక్షలు మంజూరైనట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా సిఎం సహాయ నిధి అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ; వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్, కౌన్సిలర్ బొత్స రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన జగన్‌తోనే సాధ్యం : ఎమ్మెల్యే

బొబ్బిలి : ప్రజా పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలో జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెసిపి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. జగన్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

5వ ప్రపంచ తెలుగు మహాసభకు మీసాల



బొబ్బిలి : ఈ నెల 23,24 తేదీలలో రెండురోజులపాటు విజయవాడ లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 5వ ప్రపంచ తెలుగు మహా సభలకు సాహితీ ప్రతినిధిగా హాజరయ్యేందుకు ఆహ్వానం అందిందని స్థానిక నాయుడుకాలనీకి చెందిన ప్రముఖ కవి, రచయిత, గణితోపాధ్యాయులు మీసాల చినగౌరినాయుడు తెలిపారు. మూడు వేదికల్లో నిర్వహిస్తున్న ఈ సభల్లో పి.వి.నరసింహారావు వేదికలో 23న జరుగు మహాసభల ప్రత్యేక కవి సమ్మేళనంలో పాల్గొననున్నట్లు గౌరినాయుడు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తెలుగుభాష ఔన్నత్యం, భాషా పరిణామక్రమం, భాషా తీరుతెన్నులపైఅవగాహన కలుగుతుందని అన్నారు.

ఆంధ్రా అంబేద్కర్ పివి రావు

విజయనగరం టౌన్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజ్యాంగ హక్కుల ఉద్యమంలో మాలల రిజర్వేషన్లు కాపాడేందుకు తన ప్రాణాలను ధారపోసిన ఆంధ్ర అంబేద్కర్ పి.వి రావు అని మాల మహానాడు రాష్ట్ర ప్రదాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. పి.వి రావు 17వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా మాల మహానాడు కార్యలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చీడి రామకష్ణ, జిల్లా మహిళా అద్యక్షులు చోళ్ల రాజకుమారి, జిల్లా కార్యదర్శి మామిడి కోటరావు తదితరులు పాల్గొన్నారు

విచారణ పేరుతో ఒత్తిడి

- ఎస్సి కార్పొరేషన్ సిబ్బంది నిర్వాకం
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటున్న బాధితులు

వేపాడ : విచారణ పేరిట వెళ్లిన ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగి రామారావు బాధితులపై ఒత్తిడి చేయడంతో బాధితుల ఆగ్రహావేశాలు కట్టెలు తెంచుకుంటున్నాయి. దీంతో, తమ సమస్యపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరుతున్నారు. 'దళితుల భూమి స్వాహా' అంటూ వేపాడ మండలం, చామలాపల్లిలోని భూ వ్యవహారంపై ఈనెల 19న ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వెలువడిన విషయం విధితమే. దీనిపై ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కె.సునీల్‌రాజ్‌కుమార్ విచారణకు ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి ఆదేశాలతో కార్పొరేషన్ సిబ్బంది రామారావు సంబంధిత గ్రామాన్ని సందర్శించారు. గతంలో భూమిని విక్రయించినట్టుగా అంగీకరించి సంతకాలు చేయాలంటూ గ్రామంలోని బాధిత దళితులపై ఒత్తిడిచేసేందుకు ప్రయత్నించారు. దీంతో, బాధితుల కోపం కట్టలు తెంచుకుంది. గ్రామానికి వెళ్లడానికి ముందే పత్రికల్లో వచ్చిన వార్తకు, తమకు సంబంధం లేదంటూ చెప్పాలంటూ రామారావు కోరినట్టుగా బాధితులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం తరపున విచారణ పేరిట వచ్చిన రామారావుతో మాట్లాడేందుకు బాధితులు నిరాకరించారు. తామ సమస్యపై కలెక్టర్ స్పందించాలని, లేదంటే తామే కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. దీనిపై ఇడి పద్మావతిని ప్రజాశక్తి వివరణ కోరగా ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నామని, బాధితులు ఇచ్చిన వివరాల ఆధారంగా రికార్డులు తనిఖీచేసి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇతరులు కొనుగోలు చేయడానికి వీలు లేదని తెలిపారు. ప్రస్తుతం వివాదంలోవున్న ఆ భూమిపై మార్టుగేజ్ ఉందా? ఎత్తివేశారా? అన్న కోణంలో కూడా తమ పరిశీలన ఉంటుందని స్పష్టం చేశారు.

ఘనంగా సిఎం పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఆధ్వర్యంలో బుధవారం సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎంపిపి కేక్ కట్ చేసి నాయకులకు పంచి పెట్టారు. కొంపల్లి, జాకెరు, పాటూరు, వావిలపాడు, ఆతవ, సింగరాయి తదితర గ్రామ సచివాలయాలలో, పంచాయతీ కార్యాలయాల్లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి, మండల వైసిపి అధ్యక్షులు జగ్గుబాబు తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 కేజీల కేకును ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు ఆధ్వర్యంలో కట్ చేశారు. అనంతరం వందమంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పలు క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సిఎం పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం స్థానిక కుసుమంచి సామాజిక భవనంలో నిర్వహిస్తున్న శ్రీ కన్యకా పరమేశ్వరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఎమ్మెల్సీ సురేష్‌బాబు చేతులు మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాలలో ఉదయం నవరత్నాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శివాలయం వద్ద కోనేటి గట్టుపై మొక్కలు నాటారు. గ్రామంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జెడ్పిటిసి గదల సన్యాసినాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



కొత్తవలస: కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు కంటకాపల్లి హైస్కూలులో విద్యార్థులు మధ్య ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మదిన లక్ష్మి, అప్పలరాం, ఉప సర్పంచ్ బోదల సుధాకర్, పిఎస్ఎన్ పాత్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కొత్తవలస జంక్షన్ లోగల వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పేదలకి వస్త్ర దానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి జన్మదినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్పిటిసి నెక్కల శ్రీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, కొత్తవలస సర్పంచ్ మచ్చా ఎర్రయ్య రామస్వామి, వైస్ సర్పంచ్ పి.చెల్లయ్య, స్థానిక నాయకులు ఆదిరెడ్డి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గుర్ల: మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం సీఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎంపిపి పొట్నూరు ప్రమీల, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి సూర్యనారాయణ రాజు, జెడ్పిటిసి శీర అప్పల నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తిరుపతి రావు, వైసిపి నాయకులు అంబళ్ళ చిన్నారావు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు మధుసూధన రావు, వరద ఈశ్వరరావు, రవిబాబు, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరాన్ని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి సిఎంకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జగనన్న జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి బి. లింగేశ్వర రెడ్డి, జిల్లా వైసిపి కార్యదర్శి సూర్యనారాయణ రాజు, జడ్పిటిసి వలిరెడ్డి శిరీష, మండల నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి అనంతం, మార్కెట్ కమిటీ చైర్మన్ దన్నాన జనార్దన్, యువ నాయకులు బెల్లాన వంశీ కృష్ణ, గరివిడి మాజీ ఏఎంసి చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, గుర్ల ఎంపిపి పొట్నూరు ప్రమీల, సన్యాసి నాయుడు, జెడ్పిటిసి శీర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రగతికి విప్లవాత్మక మార్పులు

ప్రజాశక్తి - గజపతినగరం

ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా ప్రగతికి విప్లమాత్మక మార్పులు చేపడుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా విప్లవం మొదలైందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి చేపట్టని సంస్కరణలు తమ ప్రభుత్వం చేపడుతుందన్నారు. భావితరాల బంగారు భవిష్యత్తుకు తమ ప్రభుత్వం బాటలు వేస్తుందన్నారు. నియోజకవర్గంలో రూ.3.75కోట్ల విలువ చేసే ట్యాబ్‌లు అందించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితిలో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన తన చేతులు మీదుగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి అప్పలస్వామి నాయుడు, ఎంఇఒ ఎస్ విమలమ్మ, జెడ్పిటిసి గార తౌడు, ఎఎంసి చైర్మన్ ముత్యాల నాయుడు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి నారాయణ మూర్తి రాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచ్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు భూసినాయుడు, ఎంపిడిఒ కె.కిషోర్ కుమార్, ఉప సర్పంచ్ మండల సురేష్, బెల్లాన త్రినాధరావు, పల్లి సంజీవరావు, బూడి వెంకటరావు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గరివిడి: విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్‌పి చైర్మన్

డెంకాడ : వివిధ పథకాల ద్వారా విద్యార్థులు చదువులు సాఫీగా సాగేందుకు తల్లిదండ్రులకు భారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నెల్లిమర్ల నియోజవర్గంలో ఉన్న నాలుగు మండలాల 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. వీరు 10వ తరగతికి వచ్చేటప్పటికి వీటి ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, జెడ్పిటిసి బడుకొండ లక్ష్మి, డెంకాడ పిఎసిఎస్ చైర్మన రొంగలి కనక సింహాచలం, ఎంపిడిఒ డిడి. స్వరూప రాణి, ఎంఇఒ లలిత కుమారి, అంబళ్ల కృష్ణారావు, పినతాడివాడ, డెంకాడ సర్పంచులు లంక లక్ష్మణరావు, పతివాడ గౌరీ పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి బాయ్స్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో వైసిపి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెచ్చిందన్నారు. ఈ ట్యాబ్‌లను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

బొబ్బిలి : గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకష్ణారావు, వార్డు కౌన్సిలర్ సావు శారద, ఎంపిపి శంబంగి లక్ష్మి, జెడ్పిటిసి సంకిలి శాంతకుమారి,ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదిక్ గణితంతో భవిష్యత్తు



మాట్లాడుతున్న రామారావు

బొబ్బిలి: వేదిక్ గణి తంతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని గణితం ఉపాధ్యాయులు జి.రామారావు అన్నారు. గురువారం గణిత దినోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేదిక్ గణితంలో మెలకువలు నేర్చుకుంటే కాంపిటేటివ్ పరీక్షలు సులభంగా రాయవచ్చునన్నారు. విద్యార్థులకు వేదిక్ గణితంపై అవగాహన కల్పించేందుకు వీడియోలు తీసి యూ ట్యూబ్ లో పెడుతున్నామన్నారు. గణితంలో వేగం, ఖచ్చితత్వం పెంపొందించుకోవాలన్నారు. గణితంపై భయం వీడాలని విద్యార్థులకు సూచించారు.

83వ సారి రక్తదానం

బొబ్బిలి : ప్రాణాపాయ స్థితిలో వున్న వారికి రక్తం ఇచ్చి కాపాడే వారు ఎల్లప్పుడూ సామాజిక సేవలో స్ఫూర్తి దాయకంగా నిలుస్తారని గ్రీన్ బెల్ట్ అధ్యక్షుడు ఎస్.వి.రమణ మూర్తి అన్నారు. బుధ వారం సామాజిక సేవా కార్యకర్త యం.విజయ మోహన్ రావు పార్వతీపురం మన్యం జిల్లాకు మారుమూల గ్రామానికి చెందిన ఒక మహిళకు గర్భ సంచి ఆపరేషన్ నిమిత్తం అత్యవసర పరిస్థితుల్లో స్థానిక బొబ్బిలిలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రమణ మూర్తి మాట్లాడుతూ విజయ మోహన్ 83 సార్లు రక్తం ఇవ్వడం అభినందనీయమని అన్నారు. యువతరం విజయమోహన్ ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఆయనకు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ సభ్యులు మెమోంటో, ప్రశంసాపత్రం అందజేశారు

నేడు ప్రమాణ స్వీకారం

బొబ్బిలి : వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం గురువారం ఎఎంసి కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయనుంది. చైర్మన్ గా బొమ్మి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ గా తెంటు పార్వతి, గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మరో 18మందిని డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామాల్లో పొగమంచు

వేపాడ : మండలంలో బుధవారం సింగరాయి, జగ్గయ్యపేట, కరకవలస, చామలాపల్లి, వేపాడ, వీలుపర్తి గ్రామాల్లో పొగ మంచు కురిసింది. మంచు దట్టంగా కురవడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఉబ్బస వ్యాధి ఉన్న వారు ఇంటికే పరిమితమయ్యారు. మంచు విపరీతంగా కురవడంతో చలి తీవ్రత కూడా పెరిగిందని ప్రజలు చెబుతున్నారు. కాగా ఈ మంచు వల్ల పూత దశలో ఉన్న మామిడి, పెసర పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భోగాపురం: జాతీత రహదారి వెంబడి బుధవారం ఉదయం 9 గంటల వరకు కురిసిన పగ మంచుతో వాహన చోధకులు తీవ్ర అవస్థలు పడ్డారు. రహదారి సక్రమంగా కనిపించక మార్గం మధ్యలో ఆగుతూ ప్రయాణించారు. మరోపక్క మామిడి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే కొత్తగా పూత ప్రారంభమైందని ఇటువంటి పొగ మంచుతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు ఆవేదన చెందుతున్నారు.

చంద్రబాబు పర్యటన జయప్రదానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి- డెంకాడ

ఈ నెల 24న విజయనగరం కోట వద్ద జరగనున్న చంద్రబాబు బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా చంద్రబాబు గురువారం నెల్లిమర్ల నియోజకవర్గం మీదగా రాజాం వెళుతున్న సందర్భంగా నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు అధికంగా పాల్గొని స్వాగతం పలకాలని అన్నారు. ఆ రోజు ఉదయం విశాఖపట్నం ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గాన భోగాపురం మీదుగా రాజాం వెళ్తారని 12 గంటలకు నాతవలస వద్ద ఆయనకు స్వాగతం పలకాలని కోరారు. అనంతరం శనివారం నిర్వహించనున్న సభకు 5వేలకు పైగా కార్యకర్తలు హాజరుకావాలన్నారు. అదే రోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో మండలంలోని చింతలవలసలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరిస్తారని అక్కడకు కూడా వేల సంఖ్యలో కార్యకర్తలు రావాలని చెప్పారు. మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ, నాయకులు పతివాడ వెంకట శివ విద్యసాగర్ నాయుడు, పాణి రాజు, పతివాడ తమ్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: సమావేశంలో మాట్లాడుతున్న కంది చంద్రశేఖర్

గజపతినగరం : జిల్లాలో చంద్రబాబు పర్యటనను విజయవంతం చెయ్యాలని మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు, నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. బుదవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 24న శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు బొబ్బిలిలో ప్రారంభమై 2.30 గంటలకు గజపతినగరం వస్తారని ఇక్కడ స్వాగతం పలికి, విజయనగరం వరకు ఆయనతో వెళ్లి కోట జంక్షన్ లో జరగనున్న బహిరంగ సమావేశంలో పాల్గొంటామని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ప్రజాశక్తి- గజపతినగరం

మండలం లోని తుమ్మికాపల్లి, కెఎస్ఆర్ పురం, కాలంరాజుపేట, పిడిశీల గ్రామాల్లో మొక్కజొన్న పంటను ఎఆర్ఎస్ శాస్త్రవేత్త ఎంవివి శ్రీనివాసరావు, ఏరువాక శాస్త్రవేత్త స్వాతి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మహరాజన్, ఎఒ ధనలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పోషక యాజమాన్యం, కత్తెర పురుగు నివారణ చర్యలు మీద అవగాహన కల్పించారు. మండలంలోని సుమారు 1600 ఎకరాల మొక్కజొన్న పంట సాగు రబీలో చేపడుతున్నట్లు వారు తెలిపారు. రైతులు జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న నాటినప్పుడు ఎరువు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఒక బస్తా యూరియా, ఒకబస్తా డిఎపి, అర బస్తా పొటాస్ విత్తు దగ్గరిలో వేయాలన్నారు. ఎకరాకు 33వేల మొక్కలు విత్తుకుంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు బంగారు నాయుడు, శంకర్రావు, వ్యవసాయ శాఖ సహాయకులు ప్రమీల మస్తాన్, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది సత్యనారాయణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇది పేదల ప్రభుత్వం



మాట్లాడుతున్న గేదెల వెంకటేశ్వరరావు

రేగిడి : వైసిపి పేదల ప్రభుత్వమని, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిఎటి టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సమీప తోటలో ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగుల లంచ్ విశ్రాంతి సమయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను ఆదుకుంటుందన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులు బాగా పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 50వ జన్మదిన వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావు, వీరఘట్టం ఎంపిడిఒ ప్రభాకర్ రావు, ఇఒపిఆర్‌డి ప్రభాకర్ రావు, రాజశేఖర్, గోవిందరావు, ఏవీ పురం సర్పంచ్ చుక్కా వెంకట నాయుడు, పంచాయతీ కార్యదర్శులు హేమ సుందర్రావు, గోపాలరావు, కేశవరావు, పోలినాయుడు గోవిందరావు, గోపి, వెంకటరావు, జ్యోతిర్మయి, జగదాంబ,గౌరమ్మ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - గరివిడి

మండలంలోని కొండపాలెం పంచాయితీ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 20/పిలో 21.587 హెక్టార్లలో మాంగనీస్ తవ్వకాలకు సంబంధించి మెసర్స్ ఆర్‌బిఎస్ఎస్‌డి ఆధ్వర్యంలో అనుమతులు కోసం కొండపాలెం ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రజలు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ గణపతి రావు మాట్లాడుతూ పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మైనింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ నిర్వహించాలన్నారు. ప్రజల అభిప్రాయాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమాలు రహదారి అభివృద్ధి కార్యక్రమాలతో పాటుగా ప్రజలు అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని మైనింగ్ నిర్వహణ చేపట్టాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ సుదర్శన్, తహశీల్దార్ టి. గోవిందు, గరివిడి జెడ్‌పిటిసి సభ్యులు వాకాడ శ్రీనివాసరావు, గరివిడి మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రమీల, మాజీ ఎంపిపి కొనసి కృష్ణనాయుడు, బమ్మిడి అప్పలస్వామి, ఎడ్ల అప్పారావు, వలిరెడ్డి లక్ష్మణ, జనసేన నాయకుడు తుమ్మగంటి సూర్యనారాయణ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొండపల్లి : మండలంలోని అంబటివలస వద్ద జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం ముద్దూరు గ్రామానికి చెందిన మునకాల శివ(32) విజయనగరం ఆస్పత్రిలో ఉన్న తమ బంధువులను పరామర్శి ఇంటికి తిరిగి తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అదే సమయంలో గజపతినగరం నుంచి విజయనగరం వెళున్న టాటా ఎసి వాహనం ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందింది. శివకు భార్య నారాయణమ్మ, కూతురు సోనియా (10), కొడుకు రోహిత్ (8) ఉన్నారు. బొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డిఎల్‌డిఎ చైర్మన్‌కి పితృవియోగం

గుర్ల : మండలంలో గరికవలస గ్రామానికి చెందిన జిల్లా పశు ఘనాభివృద్ధి చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు తండ్రి పాపినాయుడు మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాధానికి గురయ్యారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఆయనతో పాటు జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపిపి తోట తిరుపతిరావు, మాజీ ఎంపిపిలు వరదా ఈశ్వరరావు, అట్టాడ రామకృష్ణ, కెల్ల రమణ తదితరలు ఉన్నారు.

శిక్షణ కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

దేవాలయంలో వాడే పుష్పాల నుండి వచ్చిన వ్యర్థాలతో అగరవత్తులు, డూప్‌స్టిక్స్ తయారీపై ఇవ్వనున్న శిక్షణా కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి కోరారు. బుధవారం రామతీర్థం గ్రామంలో అగరబత్తులు, డూప్‌టిక్స్ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యంనారాయణ, సారిక వైకుంఠం, ఎంపిడిఒ జి. గిరిబాల, తహశీల్దార్ కె.వి.రమణ రాజు, పంచాయతీ విస్తరణాధికారి హెచ్.బానోజీరావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి సుధారాణి

సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణం లోని నూతనంగా నియ మించిన అంగ న్వాడీ సూపర్ వైజర్ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్నారని పట్టణ అంగన్వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. వేధింపులకు పాల్పడుతున్న సూపర్ వైజర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సూపర్ వైజర్‌కు పిఒ కొమ్ము కాస్తున్నారని చెప్పారు. సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శంబంగి హామీ ఇచ్చారు.



సమస్యను ఎమ్మెల్యేకు వివరిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది